క్లుప్తంగా

అరసాడలో విద్యార్థుల ఆందోళన



బస్సులను అడ్డుకున్న విద్యార్థులు

వంగర: మండల పరిధి అరసాడలో విద్యార్థులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. వంగర, రుషింగి, కొప్పర గ్రామాల నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సులను అరసాడ బస్టాప్‌లో నిలుపుదల చేయడం లేదంటూ వారంతా ఆందోళనకు దిగారు. బస్సులను నిలుపుదల చేసి నినాదాలు చేశారు. ప్రతీ రోజు బస్సులను నిలుపుదల చేయకపోతే కళాశాలలకు, పాఠశాలలకు ఎలా వెళ్లేది అని ప్రశ్నించారు. అక్కడకు చేరుకున్న తహసీల్దార్ పిన్నింటి రామారావు విద్యార్థులతో మాట్లాడారు. సమస్యను పాలకొండ డిపో మేనేజర్‌కు వివరించి సమస్య పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రభుత్వ కళాశాలను సందర్శించిన డీవీఈవో



విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న డీవీఈవో

బాడంగి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఇంటర్ జిల్లా విద్యాధికారి ఎస్.తవిటినాయుడు శుక్రవారం సందర్శించారు. కళాశాలలోని మౌలిక వసతులు, పరిసరాలను పరిశీలించారు. ప్రిన్సిపాల్ కార్యాలయంలో రికార్డులు, హాజరు పట్టీని చూశారు. అనంతరం విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ మంచిగా చదివి ఉన్నతంగా ఎదగాలన్నారు. ఆయనతో పాటు ప్రిన్సిపాల్ విజయకుమారి, అధ్యాపకులు ఉన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ సురేష్ ముఖర్జీ, పాల్గొన్న అధికారులు

వంగర: గ్రామ పంచాయతీల అభివృద్ధికి సమష్టి కృషి చేయాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు వోన్ సోర్సు రెవెన్యూ (ఓ.ఆర్.ఎస్) శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామ పంచాయతీలకు నిధులు సమకూర్చడం, ఆర్థిక వనరులు గుర్తించడం వంటి పనులు పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు భాగస్వామ్యంతో చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో టి.రాజారావు, ఈవోపీఆర్‌డీ కెల్ల రామారావు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన

రాజాం : మండలంలోని బొద్దాం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈవో యాగాటి దుర్గారావు శుక్రవారం తనిఖీ చేశారు. వంటలు మెనూ ప్రకారం వండడంతో పాటు రుచిగా ఉండేలా చూడాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు శాతంపై ఆరా తీశారు. శతశాతం హాజరుపై దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఫార్మేటివ్ పరీక్షల నిర్వహణపై ఉపాధ్యాయులతో సమీక్షించారు.

నిషేధిత పాలిథిన్ సంచులు వినియోగిస్తే చర్యలు

రాజాం : నిషేధిత పాలిథిన్ సంచులు వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలో పలుచోట్ల వ్యాపార దుకాణాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా షాపుల్లో వినియోగిస్తున్న నిషేధిత ముచ్చు సంచులపై ఆరా తీశారు. మొత్తం 18 షాపులు నుంచి 32 కిలోల సంచులను సీజ్ చేశారు. వీటిని వినియోగిస్తున్న వారికి నోటీసులు ఇవ్వడంతో పాటు రూ.36 వేలు అపరాధ రుసుం విధించారు. భవిష్యత్తులో వీటి వినియోగం ఆయా షాపుల వద్ద ఉంటే సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇనెస్పెక్టర్ సీహెచ్ ప్రసాద్, ఆయా వార్డులకు చెందిన వెల్ఫేర్ అసిస్టెంట్‌లు ఉన్నారు.

బాణసంచా నిల్వలు అక్రమంగా ఉంటే చర్యలు : డీఎస్పీ

బాడంగి: అనుమతి లేకుండా బాణసంచా విక్రయాలు చేసినా.. నిల్వలు కలిగి ఉన్నా కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ భవ్యారెడ్డి హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం మాట్లాడారు. బాణసంచా నిల్వలకు సంబంధించి ప్రజలకు ఎటువంటి సమాచారం ఉన్నా తమకు తెలియజేయాలని కోరారు. ప్రస్తుతం సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

కూటమి విద్య, వైద్యాన్ని అమ్ముకుంటుంది

- వైఎస్సార్‌సీపీ రాజాం ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్



రాజాంలో కోటి సంతకాల సేకరణ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ రాజాం ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రాజాం : రాష్ట్రంలో కూటమి పాలన అరాచకంగా మారిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజాం ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ మండిపడ్డారు. విద్య, వైద్యాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు అడుగులేస్తుందని, పేద ప్రజలకు సంక్షేమాన్ని అందకుండా చేసేందుకు కుట్ర జరుగుతుందని దుయ్యబట్టారు. శుక్రవారం రాజాంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణను నిరసిస్తూ కోటి సంతకాల సేకరణలో భాగంగా వైఎస్సార్ సీపీ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకూ పెద్ద ఎత్తున జరగాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 40శాతానికి మించి ఓటర్లు వైఎస్సార్ సీపీ వెంట ఉన్నారని, వారికి అండగా నిలిచేందుకు కూటమి చేస్తున్న కుట్రలను బద్దలుకొట్టాలని, మిగిలిన ప్రజలు అందరికీ ఎలా మోసపోతున్నారో వివరించాలని తెలిపారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేయడం ద్వారా పేద విద్యార్థులకు మెడికల్ చదువులు అందవని, పేదవారికి ఉచిత వైద్యం దక్కదని వివరించారు. కోటి సంతకాల సేకరణలో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యం కావాలని కోరారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు టంకాల అచ్చెన్నాయుడు, రాజాం పట్టణ, రూరల్ కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యులు బండి నర్సింహులు, రేగిడి మండలం పార్టీ కన్వీనర్ వావిలపల్లి జగన్మోహనరావు, దూబ గోపాలం, పార్టీ జిల్లా కార్యదర్శి కనకల సన్యాశినాయుడు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, వైఎస్సార్‌సీపీ పెన్షన్ అండ్ ఎంప్లాయీస్ విభాగం నియోజకవర్గ కన్వీనర్ పాలవలస శ్యాంసుందరరావు, జిల్లా కల్చరల్ అధ్యక్షులు డాక్టర్ బి.నరేంద్ర, ఆర్‌టీఐ విభాగం అధ్యక్షులు వంజరాపు విజయ్ కుమార్, మున్సిపల్ వింగ్ అధ్యక్షులు శాసపు వేణుగోపాలనాయుడు, జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షులు గంధవరపు హేమంత్, సలాది సతీష్, సర్పంచ్ నక్క శ్రీనివాసరావు, టంకాల ఉమాపాపినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లేకుంటే రికవరీ తప్పదు : డీఈ



చేపల మార్కెట్ వీధిలో డ్రిల్లింగ్ చేస్తూ కోర్ తీస్తున్న క్వాలిటీ కంట్రోల్ డీఈ

రామభద్రపురం: పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన నిర్మాణ పనులలో నాణ్యత లేకుంటే రికవరీ తప్పదని పంచాయతీరాజ్ శాఖ క్వాలిటీ కంట్రోల్ డీఈ బి.లక్ష్మణరావు అన్నారు. మండలంలోని శుక్రవారం ఆయన పలు గ్రామాలలో పల్లె పండగ పేరుతో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన పలు పనులకు డ్రిల్లింగ్‌తో కోర్‌లు తీసి నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది 222 పనులకు నాణ్యత పరిశీలించామని, అందులో 69 నాణ్యత లేని పనులను గుర్తించామన్నారు. వాటికి రూ.9.9 లక్షల రికవరీ చేశామని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపట్టిన సీసీ రోడ్లు, కాలువలు, ప్రభుత్వ కార్యాలయ బిల్డింగ్‌లు వంటి పనులకు ఎస్టిమేట్ ప్రతిపాదనలు ఎలా ఉన్నాయి? ఎం బుక్ రికార్డు ఎలా చేశారన్నది పరిశీలిస్తున్నామన్నారు. క్వాలిటీ పరంగా ఎం 20 గ్రేడ్ నాణ్యత ఉండాలన్నారు. స్థానిక సర్పంచ్ రవ్వా ఈశ్వరరావు, క్యూసీ ఏఈ పి.శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ అసిస్టెంటు సిహెచ్.నాగసుమ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులపై ప్రేమతత్వం కలిగి ఉండాలి



దివ్యాంగులకు కల్పించిన చట్టాలను వివరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ

రాజాం సిటీ: ప్రతి ఒక్కరు దివ్యాంగుల పట్ల ప్రేమతత్వం కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ అన్నారు. ప్రపంచ మానసిక దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక సారథి రోడ్డులోని దివ్యాంగుల పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు అందుతున్న సేవలను, మౌలిక సదుపాయాల కల్పనపై ఆరా తీశారు. దివ్యాంగులకు కల్పించిన చట్టాలను వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు నాగభూషణరావును అభినందించారు. న్యాయవాదులు ఆర్.విజయకుమార్, ఎం.శ్రీనివాసరావు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు టీటీపీ రమణమూర్తి, గట్టి పాపారావు, పెంకి చైతన్యకుమార్, ఏఎస్సై ఎస్.సుగుణాకరరావు తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన యూరియా పంపిణీ



రైతులతో మాట్లాడుతున్న ఎస్ఐ ఆర్.గోపాలరావు

సంతకవిటి: మండలంలోని చిత్తారపురం సచివాలయంలో శుక్రవారం యూరియా పంపిణీ ఉన్న విషయం తెలుసుకుని చిత్తారపురం, గుజ్జన్నపేట, గారన్నాయుడుపేట, పోడలి, పనసపేట, గెడ్డబూరాడపేట గ్రామాలకు చెందిన రైతులు వేకువజాము నుంచి సచివాలయానికి చేరుకున్నారు. ఎసచివాలయంలో 444 బస్తాల యూరియా పంపిణీకి సిద్ధంగా ఉంచారు. వచ్చిన యూరియా కంటే రైతులు అధికంగా రావడంతో ఒక్కో రైతుకు ఒక బస్తా యూరియా చొప్పున ఇచ్చినా సరిపోదు. వన్-బీలు తీసుకువస్తేనే యూరియ ఇస్తామని చెప్పడంతో, చిత్తారపురం రెవెన్యూ బౌండరీలోని 1-బీలు రాని పనసపేట, గెడ్డబూరాడపేట రైతులు మరి మా పరిస్థితి ఏంటి, మేము వ్యవసాయం మానేయాలా? మాకు యూరియ ఎవరిస్తారు? అని అధికారులను నిలదీశారు. తమకు యూరియా ఇస్తేనే పంపిణీ చేయండి లేదంటే లేదని పట్టుబట్టారు. ఎస్ఐ ఆర్.గోపాలరావు సచివాలయానికి వచ్చి రైతులతో మాట్లాడినా ప్రయోజనం లేకపోవడంతో సోమవారం యూరియా పంపిణీ చేస్తామని అధికారులు యూరియా పంపిణీని నిలిపివేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బాలికల పాఠశాల విద్యార్థినులు



రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టుకు ఎంపికైన విద్యార్థినులతో హెచ్‌ఎం తదితరులు

రాజాం సిటీ: స్థానిక సారధి బాలికల పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం మాధురి శుక్రవారం తెలిపారు. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన పోటీల్లో చక్కని ప్రతిభ కనబర్చి ఇద్దరు విద్యార్థినులు పూర్ణ, స్రవంతి క్రికెట్‌కు జట్టుకు, తవిటమ్మ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థినులను హెచ్‌ఎంతో పాటు పీడీ రేణుకాదేవి, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

పారిశుధ్య కార్మికుల పూజలు

బొబ్బిలి: పట్టణంలోని చిక్కాల రెల్లివీధిలో సామూహిక రుద్రాభిషేకం నిర్వహించారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులు పాల్గొన్న ఈ నందెన్న సంబరాల కార్యక్రమంలో సమరసతా సేవా ఫౌండేషన్ డివిజన్ ధర్మప్రచారకులు ధూపం వాసు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బంగారు చిన్నికృష్ణ తదితర కార్మికులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మానసిక ఆరోగ్య సమస్యలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి రోహిణీరావు

బొబ్బిలి: మానసిక ఆరోగ్య సమస్యలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండేలా చర్యలు తీసుకోవాలని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిణీరావు అన్నారు. శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్థానిక సీహెచ్‌సీలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఏటా అక్టోబర్ 10న ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దీనిని గతంలో ప్రపంచ మానసిక ఆరోగ్య సమాఖ్య ప్రారంభించగా ఇప్పుడు దానిని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వహిస్తోందన్నారు. మానసిక ఆరోగ్య సమస్యలపై అవగాహన, మానసిక ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం దీని ఉద్దేశాలన్నారు. ప్రతీ ఒక్కరూ దీని కోసం కృషి చేయాలన్నారు. ఆయా రోగుల పట్ల వైద్య సిబ్బంది శ్రద్ధ వహించాలన్నారు. సీహెచ్‌సీ వైద్యాధికారి జి.శశిభూషణరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు వంగర విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

వంగర: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు వంగర ఆర్.సి.ఎం.విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల శ్రీకాకుళం కోడి రామమూర్తి స్టేడియంలో జరిగిన పోటీల్లో త్రోబాల్ విభాగంలో తొమ్మిది మంది విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో కొమ్ము రాజేష్, కంటు హరికృష్ణ, వెలగాడ గౌతమ్, అండర్-17 విభాగంలో బొత్స శివ గణేష్, బొమ్మాళి అఖిల్, రౌతు వెంకటరమణ, కంటు పవన్ అండర్-19 విభాగంలో ఒమ్మిదారుపు శివకృష్ణ, ఖండాపు లోకేష్ ఎంపికయ్యారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ సిస్టర్ ఫ్లోరిండా, పీఈటీ అరసాడ కృష్ణ విద్యార్థులను అభినందించారు.

తోటపల్లి పిల్ల కాలువకు గండి



కాలువకు గండిపడి నీరు వృథాగా పోతున్న దృశ్యం

రాజాం : మండలంలో పొగిరి గ్రామ సమీపంలోని పంట పొలాల వద్ద తోటపల్లి 7 ఎల్ పిల్ల కాలువకు గండి పడింది. లెప్రసీ ఆస్పత్రి సమీపంలో స్లూయూస్‌కు బీటలు ఏర్పడడంతో నీరు ఉధృతంగా వచ్చి కాలువకు గండి ఏర్పడింది. దీంతో కాలువ ద్వారా వచ్చే కాస్తా నీరు వృథాగా కంచెడు చెరువుకు పోతుంది. దీంతో ఈ కాలువ ఆయకట్టులోని పొగిరి, బొడ్డవలస, నందబలగ పరిధిలోని 1800 ఎకరాల వరి పంటకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ గండిని పూడ్చాలని రాజాంలోని తోటపల్లి కాలువ డీఈ ఈల కార్యాలయాలకు వెళ్లి ఫిర్యాదు చేసామని, ఇంతవరకూ ఎవరూ రాలేదని రైతులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గండిని పూడ్చాలని రైతులు కోరుతున్నారు.

గ్రామాలు శుభ్రంగా ఉండాలి



గడిముడిదాంలో చెత్తసేకరణ పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో

రాజాం : మండలంలోని గ్రామాలు శుభ్రంగా ఉండాలని డిప్యూటీ ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలంలో గడిముడిదాం, కంచరాం, ఆగూరు, దోసరి తదితర గ్రామాల్లో చెత్త సేకరణపై శుక్రవారం ఆరా తీయడంతో పాటు మౌలిక సమస్యలపై వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు పరిసరాల పరిశుభ్రతపై దృష్టి ఉంచేలా చూడాలని తెలిపారు. క్లాప్ మిత్రలు ప్రతీరోజు చెత్త సేకరణ చేయాలని, డంపింగ్ యార్డులు వద్ద సేంద్రియ ఎరువుల తయారీపై శ్రద్ధ చూపించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల కార్యదర్శులతో పాటు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బాలికలకు వ్యాసరచన పోటీలు



జూనియర్ కళాశాల బాలికలకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న సూపర్‌వైజర్లు

రామభద్రపురం: మండలంలోని బాలిక దినోత్సవం సందర్భంగా పలు పాఠశాలలు, కళాశాలల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం బాలికలకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సూర్యకుమారి, కృష్ణకుమారి, రత్నకుమారి పోటీలను పర్యవేక్షించారు. ఇందులో ప్రతిభ చూపిన బాలికలకు అవార్డులు ప్రధానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నిర్వాహకులు నాగమణి, రాధ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

ఉపాధి వేతనదారులందరికీ ఈకేవైసీ

తెర్లాం: ఉపాధి హామీ పథకం వేతనదారులకు క్షేత్ర సహాయకులు ఈకేవైసీ నమోదు చేయాలని మండల ఉపాధి హామీ పథకం ఏపీవో సుశీల అన్నారు. తెర్లాం, టి.చిన్నయ్యపేట గ్రామాల్లో శుక్రవారం ఉపాధి క్షేత్ర సహాయకుడు జె.శంకరరావు వేతనదారులకు ఈకేవైసీ చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమాన్ని పరిశీలించిన ఏపీవో మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో గల ఉపాధి వేతనదారులకు ఈకేవైసీ నమోదు చేస్తున్నామని తెలిపారు.

అప్పారావు మాస్టారు సేవలు ప్రశంసనీయం

తెర్లాం: ఉపాధ్యాయ వృత్తిలో 36 ఏళ్ల పాటు అంకిత భావంతో పనిచేసి, ఇటీవల పదవీ విరమణ చేసిన మాడుగుల వెంకట అప్పారావు సేవలు ప్రశంసనీయమని సమాచార శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ డి.రమేష్ అన్నారు. మండలంలోని నందిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితశాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేసి పదవీ విరమణ చేసిన వెంకట అప్పారావు మాస్టారును శుక్రవారం పాఠశాల విద్యార్థులు, సహచర ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు విజయగౌరి, పాఠశాల హెచ్‌ఎం శ్రీధర్, ఎస్‌ఎం పురం రెసిడెన్షియల్ స్కూల్ విశ్రాంత ప్రిన్సిపాల్ పాలిశెట్టి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ మాడుగుల వీరభద్రస్వామి తదితరులు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్‌టీ సూపర్ పొదుపు

బాడంగి: కేంద్ర ప్రభుత్వం జీఎస్‌టీ 2.0 ప్రకారం రేటు శాతాన్ని తగ్గించడంతో పలు వస్తువుల రేట్లు మేరకు తగ్గుతున్నాయో తెలుపుతూ అవగాహన కార్యక్రమాన్ని ఎంపీడీవో రామకృష్ణ శుక్రవారం అవగాహన కల్పించారు. సూపర్ జీఎస్‌టీ సూపర్ పొదుపు నినాదంతో ఆయన స్థానిక ఎలక్ట్రానిక్ షాపు వద్దకు సిబ్బందిని తీసుకెళ్లి ఏఏ వస్తువుపై ఎంతెంత తగ్గుదల వస్తున్నదీ వివరంగా షాపు యజమానితో అవగాహనకల్పించారు.

బాలికల పాలిట వరం సఖీ చట్టం

బాడంగి: ప్రభుత్వం ఆధ్వర్యంలో అమలవుతున్న సఖీ చట్టం బాలికల పాలిట వరం లాంటిదని దానిని తప్పక పాటించాలని ఐసీడీఎస్ పీవో వరహ లక్ష్మి తెలిపారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక హైస్కూల్, కేజీబీవీ, ప్రభుత్వ కళాశాలల్లో అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు గౌరమ్మ, నాగమణి, కార్యకర్తలు, బాలికలు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలను సమర్థవంతంగా నిర్వహించాలి

తెర్లాం: మండలంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండిస్తున్న వరి పంటకోత ప్రయోగాలను గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు కలిసి సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల సహాయ గణాంకాధికారి యు.సురేష్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకానికి సంబంధించి వరి పంటకోత ప్రయోగాలపై వీఆర్‌వోలు, వీఏఏలకు శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మండల సహాయ గణాంకాధికారి సురేష్, మండల సర్వేయర్ అప్పలనాయుడు, ఆర్ఐ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు ప్రయోజనం

గంట్యాడ: జీఎస్టీని రెండు శ్లాబులకు పరిమితం చేయడం వల్ల వినియోగదారులకు ప్రయోజనం చేకూరుతుందని జీఎస్టీ అధికారి రెడ్డి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎలక్ట్రానిక్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామన్యులు ఉపయోగించే 99 శాతం వస్తువులను 5 శాతం శ్లాబు పరిధిలోకి చేర్చారని అన్నారు ఆరోగ్య బీమాపై పన్నును పూర్తిగా తొలిగించారని తెలిపారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో రాములమ్మ, విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గుదలపై అవగాహన

తెర్లాం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న జీఎస్టీ తగ్గుదలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విజయనగరం జీఎస్టీ అధికారి పాలవలస రామకృష్ణనాయుడు అన్నారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఎలక్ట్రానిక్ పరికరాలపై జీఎస్టీ తగ్గుదలపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వ్యాపారులు జీఎస్టీ తగ్గుదలను అమలు చేయకపోతే వెంటనే ఫిర్యాదు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో నీలిమ, పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారి రవికుమార్, వ్యాపారులు పాల్గొన్నారు.

వంగరలో ఘనంగా గ్రామదేవతల పండగ

వంగర: వంగరలో గ్రామ దేవతల పండగ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బంగారమ్మ, దేశాలమ్మ, వంగర పోలమ్మ, పెద అశిరమ్మల ఆలయాల వద్దకు భక్తులు వెళ్లి అభిషేకాలు చేశారు. పంటలు పుష్కలంగా పండాలని రైతులు పూజలు చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కిశోరి బాలికల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



కిశోరి బాలికల అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో

తెర్లాం: కిశోరి బాలికల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ పీవో వరహాలమ్మ అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శుక్రవారం తెర్లాం హైస్కూల్‌లో కిశోరి బాలికలకు సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ పీఓ కిశోర్ బాలికలను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్‌జీవో సీహెచ్ హరీష్, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతుల్లో ప్రకృతి వ్యవసాయం

సంతకవిటి: ఆధునిక పద్ధతుల్లో ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా రైతుకు సమయం, ఖర్చు ఆదా అవుతాయని ప్రకృతి వ్యవసాయం జిల్లా డీపీఎం ఆనందరావు అన్నారు. మండలంలోని మామిడిపల్లి గ్రామంలో దాదాపు 30 ఎకరాల్లో డ్రోన్ ద్వారా కషాయాలను శుక్రవారం స్ప్రే చేశారు. డ్రోన్‌ల ద్వారా పిచికారీ చేయడం వలన పెట్టుబడి ఖర్చు తగ్గడంతో ఉత్పత్తి పెరుగుందని రైతులకు వివరించారు. మాస్టర్ ట్రైనర్ పద్మావతి, మామిడిపల్లి ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ పాత్రుని వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

కుర్చీల వితరణ

బొండపల్లి: తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ఫిర్యాదుదారులతో పాటు వివిధ పనులు నిమిత్తం వచ్చే వారి కోసం మండలంలోని నెలివాడ గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పెండ్యాల జగదీష్ 15 కుర్చీలను శుక్రవారం తహసీల్దార్ డోలా రాజేశ్వర్రావుకు అందజేశారు. కార్యక్రమంలో డీటీ రాజేశ్వర్రావుతో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఒత్తిడి లేని జీవితం పిల్లలకు అలవాటు చేయాలి

దత్తిరాజేరు: మారుతున్న సమాజానికి అనుకూలంగా పిల్లలకు అలవాటు చేయాలని కే కొత్తవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి తనీషా సుబ్బారాయుడు అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినం సందర్భంగా మహాత్మా జ్యోతిబా పూలె బాలుర గురుకుల పాఠశాలలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లలకు ఒత్తిడి లేని జీవితాన్ని అలవాటు చేయాలన్నారు.

కిశోరి బాలికలు ఆరోగ్యంపై దృష్టి సారించాలి

రేగిడి: కిశోరి బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని మండలంలోని ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోరి బాలికలకు సమావేశం నిర్వహించారు. కౌమార దశలో బాలికలు సాధికారత సాధించాలని సూచించారు. ఆరోగ్యంగా ఉండాలంటే పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు.

శిక్షణలోని అంశాలను పాటించాలి

రేగిడి: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో రెండు రోజులుగా పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారంతో ముగింపులో ఎంపీడీవో శ్యామలా కుమారి మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలను నిర్మించాలని అన్నారు.

ఈ క్రాప్ బుకింగ్ బాధ్యతగా చేయాలి

రేగిడి: మండలంలోని రైతులు సాగు చేస్తున్న పంటలకు సంబంధించి ఈ క్రాప్ బుకింగ్ చక్కగా నిర్వహించాలని తహసీల్దార్ ఐ.కృష్ణలత సూచించారు. మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏవో బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వీఆర్వోలు, వీఏఏలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సర్వే నంబరు ప్రకారం ఈ క్రాప్ చేస్తే ధాన్యం కొనుగోలు చేసేందుకు ఉపయోగపడుతుందన్నారు.

చక్కని విద్యనభ్యసించేలా చూడాలి

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు చక్కటి విద్యనభ్యసించేలా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈవో-2 బి.ఎరకయ్య సూచించారు. మండలంలోని ఆమదాలవలస పాఠశాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లల అభ్యసనా సామర్థ్యాలు, సృజనాత్మక శక్తిని పెంపొందించే విధంగా బోధించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తర్ఫీదును అందించి ఏ గ్రేడులోకి తీసుకురావాలని సూచించారు. పాఠశాల హెచ్‌ఎం ఎస్.అరుణకుమారి, సీహెచ్ లక్ష్మి, రామకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొండపల్లి: మండలంలోని గొట్లాం ఫీడర్‌లోని గొట్లాం, జియ్యన్నవలస, రెడ్డిపేట, అంబటివలస, అయ్యన్న అగ్రహారంరోళ్లవాక, దోలపేట గ్రామాలకు శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు ఏఈఈ ఆర్.శంకర్రావు తెలిపారు. విద్యుత్ లైన్లుకు అడ్డంగా ఉన్న చెట్లు కొమ్మలను తొలగించనున్నందున ప్రజలు సహకరించాలని కోరారు.